
# కంకర వేశారు.. రోడ్డు నిర్మాణం మరిచారు..

నిలిచిన కొత్తపల్లితండా-నాగిళ్ల రోడ్డు పనులు
నరకప్రాయంగా మారిన ప్రయాణం..
ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
పనులు చేపట్టాలని ప్రజల వేడుకోలు

యాచారం, మే11: మండలంలోని కొత్తపల్లి నుంచి నాగిల్ల వెళ్లే రోడ్డు ఎంతో అధ్వానంగా మారింది. యాచారం-మాడ్గుల రెండు మండలాలను కలిపే రోడ్డు నిత్యం వాహనదారులకు నరకప్రాయంగా మారింది. రూ.3.5 కోట్ల నిధులతో 7కిలో మీటర్ల మేరకు కాంట్రాక్టర్లు రోడ్డు చదును చేసి, కంకర వేసి వదిలేశారు. పనులు ప్రారంభించి 6నెలలు దాటినా రోడ్డుకు బీటీ పనులు చేపట్టే నాథుడే కరువయ్యాడు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో కొన్ని నెలలుగా రోడ్డు పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. పనులు ముందుకు సాగక పోవడంతో ప్రయాణికులు కంకర రోడ్డుతో నరకం చవి చూస్తున్నారు. అసలే మూలమలుపులు, రాత్రిపూట ఈ రోడ్డుగుండా ప్రయాణం చేయాలంటేనే ప్రజలు జంకుతున్నారు. అప్పుడప్పుడు ద్విచక్రవాహనదారులు, ఆటో డ్రైవర్లు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. మూలమలుపుల వద్ద కంకర రోడ్డులో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పడంతో ఇప్పటికే ఎంతో మంది ప్రయాణికులు రోడ్డు ప్రమాదానికి గురై గాయాలపాలయ్యారు. పనులు ప్రారంభించడం తప్ప వాటిని త్వరితగతిన పూర్తి చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతున్నదని ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుకు బీటీ వేస్తే యాచారం మండల పరిధిలోని కొత్తపల్లితండా, మాడ్గుల మండల పరిధిలోని కాట్రవత్‌తండా, నాగిళ్ల తండా, నాగిళ్ల, అప్పరెడ్డిపల్లితో పాటు ఆమనగల్లు ప్రాంతాలకు ప్రయాణికులు సులభంగా చేరుకోవచ్చు. కానీ రోడ్డు పనులు నత్తను తలపించడంతో ప్రయాణికుల కష్టాలు తీరడంలేదని ప్రజలు వాపోతున్నారు. పనులను వెంటనే ప్రారంభించి ప్రయాణికుల కష్టాలు తీర్చాలని ఆయా గ్రామా ప్రజలు కోరుతున్నారు.



కంకర పోసి వదిలేసిన కొత్తపల్లితండా-నాగిళ్ల రోడ్డు

**రోడ్డు పనులు పూర్తి చేయాలి**



స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఈ రోడ్డు నిర్మాణంపై ప్రధాన దృష్టి సారించి పనులు వేగవంతం చేసేలా తగిన చర్యలు తీసుకోవాలి. అర్థాంతరంగా నిలిచిపోయిన రోడ్డుతో ప్రజలు, ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలి. మట్టి రోడ్డును తవ్వి, కంకర వేసి దానిపై డస్టు వేసి వదిలేశారు. రోడ్డు రోలరుతో తొక్కించపోవడంతో దుమ్ము, ధూళిలతో సైతం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వీడి పనులు అతి త్వరలో పనులు ప్రారంభించాలి, లేందంటే పనులు ప్రారంభించే వరకు ఆందోళనలు చేయాల్సి వస్తుంది.

**- కావలి జగన్, మాజీ ఉపసర్పంచ్ కొత్తపల్లి**



## పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి
## ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ, మే 11: పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నందిగామ మండలం వెంకమ్మగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన రేషన్ షాపును ఆదివారం ఎమ్మెల్యే శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజలు కడుపునిండా అన్నం తినాలనే లక్ష్యంతో ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు.

**ఉచిత వైద్య శిబిరం**

శంషాబాద్ లిమ్స్ దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం చేగూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే శంకర్ ప్రారంభించారు. గ్రామాల్లో ఇలాంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్న లిమ్స్ దవాఖాన డాక్టర్ రాంరాజ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రియాంక శివశంకర్‌గౌడ్, మాజీ సర్పంచ్ రజనీతగౌడ్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సమ్మెను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

చేవెళ్లటౌన్, మే 11: ఈ నెల 20వ తేదీన నిర్వహించే సమ్మెకు కార్మికులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి తెలిపారు. ఆదివారం సమ్మె వాల్‌పోస్టర్‌ను ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ అధ్యక్షతన చేవెళ్ల పట్టణ కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను కాలరాస్తూ నాలుగు కోడ్‌లుగా చేసి కార్మిక వర్గానికి తీవ్రమైన అన్యాయం చేసిందన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, 12గంటల పని వేళలను తీసుకురావడాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం, పార్టీ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, ఏఐకేఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌గౌడ్, ఏఐటీయూసీ మండల అధ్యక్ష, కార్యదర్శులు శివ, డప్పు శివ, గీత పనివారల సంఘం మండల కార్యదర్శి కృష్ణాగౌడ్, నాయకులు ఉన్నారు.

## విజేతకు నగదు పురస్కారం



కొందుర్గు, మే 11: మండలంలోని పర్వతాపూర్ గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతకు ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి సహకారంతో నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ తనయుడు రామకృష్ణ మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఎమ్మెల్సీ టోర్నీ విజేతకు రూ.21వేలను అందజేశారన్నారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, రాంచంద్రయ్య, మల్లేశ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీను, మల్లేశ్, ఆదిత్యగౌడ్, జంగయ్య, రవి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి నగదు అందజేత

కేశంపేట, మే 11: అనారోగ్యంతో మృతి చెందిన మహిళ కుటుంబానికి బీఆర్‌ఎస్ ఆదివారం అండగా నిలిచింది. కేశంపేట మండల పరిధిలోని తొమ్మిదిరేకుల పంచాయతీ పరిధిలోని బాల్యాతండాకు చెందిన లక్ష్మి(70) ఎండవేడిమి కారణంగా వడగాలి తగలడంతో ఊపిరాడక మృతి చెందిందని ఈ విషయాన్ని తెలుసుకున్న బీఆర్‌ఎస్ నేతలు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం బీఆర్‌ఎస్‌పార్టీ తరపున రూ.10వేల నగదును బాధిత కుటుంబానికి అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సావిత్రీబాల్‌రాజ్‌గౌడ్, బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు నర్సింహులు, మాజీ ఎంపీటీసీ ఎన్.యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ రాంరెడ్డి, మాజీ వార్డు సభ్యులు గోపాల్‌నాయక్, గ్రామస్తులు చెన్నయ్య, కె.నర్సింహులు, జాన్యానాయక్, ఠాగూర్‌నాయక్, పి.నర్సింహులు, ఎన్.రాములు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ర్యాలీ



మన్సూరాబాద్, మే 11: ఆపరేషన్ సిందూర్‌కి మద్దతుగా సామాజిక కార్యకర్త దోసపాటి రాము ఆధ్వర్యంలో ఆదివారం నాగోల్ డివిజన్ పరిధి రాక్ హిల్స్ కాలనీలోని రైస్ ఏటీఎం వద్ద సంఘీభావ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా దోసపాటి రాము మాట్లాడుతూ.. ఉగ్రవాదంపై పోరు జరుపుతున్న భారత సైనికులకు ప్రతిఒక్కరూ మద్దతుగా నిలవాలని కోరారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించాలని భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని కోరారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

## క్రీడల పట్ల ఆసక్తి చూపాలి

కందుకూరు, మే 11: యువకులు క్రీడల పట్ల ఆసక్తి చూపాలని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కందపెద్ద నరసింహ, బీఆర్‌ఎస్ పార్టీ మండల యూత్ మాజీ అధ్యక్షులు అశోక్ ముదిరాజ్ తెలిపారు. దాసర్లపల్లి గ్రామంలో డీడీపీఎస్, ప్రీమియర్ లీగ్ పోటీలు నిర్వహించారు. ప్రవీణ్, బాలకృష్ణ, జట్లు చివర్లో పోటాపోటీగా తలపడ్డాయి. ఈ పోటీల్లో విజయం సాధించిన విజేతలకు బహుమతులతోపాటు జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు.

## ఘనంగా ఆత్మీయ సమ్మేళనం

మాడ్గుల, మే11: మాడ్గుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-01 చదువుకున్న విద్యార్థులు ఆదివారం మాడ్గుల పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. పూర్వ ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువాలతో సన్మానించారు. గత కాలపు జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలోని సుధాకర్, తిరుపతయ్య, నరసింహ, కొండల్, శ్రావణ్ కుమార్, వాహబ్, కృష్ణయ్య పాల్గొన్నారు.





సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

## ఘన సత్కారం

షాద్‌నగర్‌టౌన్, మే 11: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెల్జర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మనోహర్, ఉపాధ్యాయులు జ్యోతి ప్రభాస్, సుశీల మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నతస్థాయికి ఎదిగినప్పుడే తమ తల్లిదండ్రులతో పాటు విద్య నేర్పిన గురువులకు గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## రుణం మంజూరైందంటూ.. ఆన్‌లైన్ మోసం

ఒక వ్యక్తి నుంచి రూ.75,130..
మరొకరి నుంచి 34, 421
కాజేసిన సైబర్ నేరగాళ్లు
కేసు నమోదు చేసిన పోలీసులు

మొయినాబాద్, మే11: బజాజ్ ఫైనాన్స్ నుంచి కొంత లోన్ మంజూరు అయ్యిందని, దానికి కొంత డబ్బులు చెల్లించాలని సైబర్ నేరగాళ్లు చెప్పడంతో కొంత మొత్తాన్ని చెల్లించాడు ఓ బాధితుడు. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నెల రోజుల క్రితం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్ మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన ఎండీ నయూముద్దీన్‌కు గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఒక నెల క్రితం ఒక ఫోన్ కాల్ వచ్చింది. బజాజ్ ఫైనాన్స్ నుంచి లోన్ ఎగ్జిక్యూటివ్ అని పరిచయం చేసుకున్నాడు. తమ పేరు మీద రుణం మంజూరు అయ్యిందని, దానికి ముందుగా కొంత డబ్బు చెల్లించాలని చెప్పాడు. అది నమ్మిన నయూముద్దీన్ రూ.75,130 ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఆ డబ్బులు వేసిన తరువాత జీఎస్టీ, టీడీఎస్ కోసం అని మరి కొంత డబ్బును డిమాండ్ చేశాడు సైబర్‌నేరస్తుడు. దీంతో నయూముద్దీన్ అది సైబర్ మోసం అని గ్రహించి వెంటనే సైబర్ ఫోర్టల్‌లో ఫిర్యాదు చేశాడు. దానిని నాలుగు రోజుల క్రితం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌కు పార్వర్డ్ చేశారు. నాలుగు రోజుల నుంచి ఫిర్యాదుదారుడు రాకపోవడంతో సైబర్ పోర్టల్ నుంచి ఫిర్యాదును స్వీకరించి కేసు నమోదు చేయడం జరిగిందని పోలీసులు తెలిపారు.

**సైబర్ నేరానికి గురైన మరో వ్యక్తి**

టెలిగ్రామ్‌లో ఒక లింక్‌లో డబ్బులని పెట్టుబడిగా పెట్టి తిరిగి డబ్బులు రాకపోవడంతో ఓ యువకుడు సైబర్ నేరానికి మోసపోయినట్లు గుర్తించి వెంటనే సైబర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటన ఒక నెల రోజుల క్రితం మొయినాబాద్ మున్సిపాలిటీ కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్ మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన ఎండీ ఎజాస్ అనే యువకుడు ఇన్‌స్టాగ్రామ్‌లో పార్ట్‌టైమ్ ఉద్యోగం చూసి ఆ నంబర్‌కు కాల్ చేశాడు. లింక్‌లో వచ్చిన సూచనల ప్రకారం రూ.34,421 ఇన్వెస్ట్ చేశాడు. ఆ డబ్బులు తిరిగి రాకపోవడంతో వెంటనే సైబర్ ఫోర్టల్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే సైబర్ పోర్టల్ ద్వారా నాలుగు రోజుల క్రితం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ వెబ్‌సైట్‌కు వచ్చింది. పోలీస్‌స్టేషన్ వెబ్‌సైట్‌లో చూసిన పోలీసులు ఫిర్యాదు దారుడికి కాల్‌చేయగా, స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. అతడు రాకపోవడంతో ఆదివారం సైబర్ పోర్టల్‌లో చేసిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## బీసీసేన మహిళా కమిటీ ఎన్నిక



కమిటీకి నియామకపత్రం అందజేస్తున్న జయశ్రీకాంత్

కొందుర్గు, మే 11: బీసీ సేన మండల మహిళా అధ్యక్షురాలు జయశ్రీ కాంత్ ఆధ్వర్యంలో మహిళా కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బీసీసేన పద్మారం గ్రామ కమిటీ అధ్యక్షురాలిగా కమ్మరి స్వాతితోపాటు గ్రామ కమిటీ ఉపాధ్యక్షురాలు పద్మమ్మ, ప్రధానకార్యదర్శి సరస్వతి, కార్యదర్శి జయమ్మ, కోశాధికారి అమృతమ్మని ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, చంద్రశేఖర్, వరలక్ష్మి, బాల్‌రాజ్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు మేడిపల్లికి వ్యవసాయ శాస్త్రవేత్తల రాక

యాచారం, మే11: మండలంలోని మేడిపల్లి గ్రామానికి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగంగా సోమవారం శాస్త్రవేత్తలు రానున్నట్లు మండల వ్యవసాయ అధికారి రవినాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు సలహాలు సూచనలు ఇచ్చేందుకు శాస్త్రవేత్తలు రజినీకాంత్, అరుణశ్రీ ముఖ్యఅథితులుగా హాజరు కానున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామ రెవెన్యూ పరిధిలోని రైతులు, మాజీ ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

## వేముల్‌నర్వలో అర్ధరాత్రి తవ్వకాలు

గుప్తనిధుల కోసమే అంటూ అనుమానాలు



కేశంపేట, మే 11: ఆలయం సమీపంలో అనుమానాస్పద స్థితిలో తవ్వకాలు జరిగిన ఘటన కేశంపేట మండల పరిధిలోని వేముల్‌నర్వ గ్రామంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకోగా ఆదివారం ఉదయం వెలుగు చూసింది. స్థానికుల కథనం ప్రకారం.. గత 40ఏళ్ల క్రితం గ్రామంలోని కొందరికి గత్తర (గాలి వంటి మహమ్మారి) సోకడంతో కాపాడాలని వేడుకుంటూ బీరప్ప ఆలయాన్ని నిర్మించినట్లు తెలిపారు. ఆలయం సమీపంలో కొల్లూరి బుచ్చయ్య కుటుంబానికి చెందిన వ్యవసాయ పొలంలో ఓ పెద్ద బండరాయి ఉందని, ఆలయం నిర్మించిన సమయంలో బండరాయి కింద ఏమైనా గుప్త నిధులు పెట్టి ఉంటారనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గుప్త నిధులకోసమే తవ్వకాలు జరిపి ఉంటారని, తవ్వకాల్లో మట్టి కుండలు బయటపడడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఘటనా స్థలంలో జేసీబీకి సంబంధించిన ఆనవాళ్లు కనిపించడంతో ఆలయానికి వెళ్లే దారిలో ఏదైనా జేసీబీ వెళ్లిందా? అనే కోణంలో గత మూడు రోజులకు సంబంధించిన సీసీ పుటేజీని పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఘటనా స్థలాన్ని కేశంపేట పోలీసులు సందర్శించినట్లు సమాచారం.



## విద్యార్థులకు ఘన సన్మానం

ఆమనగల్లు, మే 11: పదో తరగతి, ఇంటర్మీడీయట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన పట్టణానికి చెందిన 15 మంది విద్యార్థులను ఆదివారం శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అభయాంజనేయ స్వామి దేవాలయ అధ్యక్షుడు బాలకృష్ణయ్య, కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సత్తయ్య, కోశాధికారి సాయికుమార్, కార్యవర్గసభ్యులు పరమేశ్, మురళీధర్, సుధాకార్, లింగం, ఈశ్వరయ్య, యాదగిరి, లింగప్ప, అశోక్ పాల్గొన్నారు.

## హిమపురికాలనీ పార్కు స్థలాన్ని పరిరక్షిస్తా..

మన్సురాబాద్, మే 11: హిమపురి కాలనీలో కబ్జాకు గురైన పార్కు స్థలాన్ని పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటారని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తెలిపారు. మనసురాబాద్ డివిజన్ హిమపురి కాలనీ సంక్షేమ సంఘం సభ్యుల ఆహ్వానం మేరకు ఆదివారం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సదరు కాలనీలో పర్యటించారు. కాలనీలోని ప్రధానమైన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి కాలనీవాసులు తీసుకెళ్లారు. కాలనీలో పార్కు స్థలం కబ్జాకు గురైందని.. సదరు స్థలం కబ్జాకు గురి కావడం వెనుక ఓ ప్రజాప్రతినిధి హస్తము ఉందని ఎమ్మెల్యేకు ప్రజలు వివరించారు. పార్కు స్థలం విషయంపై ఇప్పటికే జిహెచ్ఎంసి అధికారులకు, హైడ్రాకు ఫిర్యాదు చేయడం జరిగిందని ఎమ్మెల్యేకు తెలిపారు. కోట్లాది రూపాయల పార్కు స్థలాన్ని పరిరక్షించి కాలనీవాసులకు న్యాయం చేయాలని హిమపురి కాలనీవాసులు ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఎవరు భయాందోళనకు గురి కావద్దని పార్కు కబ్జా విషయాన్ని త్వరలో జిహెచ్ఎంసి కమిషనర్‌తో పాటు ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఎట్టి పరిస్థితిలోనూ పార్కు స్థలాన్ని కాపాడతానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, నాయకులు పోచబోయిన జగదీష్ యాదవ్, టంగుటూరి నాగరాజు, జక్కడి రఘువీర్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు సత్యనారాయణ, గోపికృష్ణారెడ్డి, బద్రీనాథ్, రవి కిరణ్, సత్యనారాయణ రెడ్డి, దత్తం రెడ్డి, యాద సంతోష్ కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

**హిమపురి కాలనీలో ఘనంగా మాతృ దినోత్సవం**

మాతృ దినోత్సవ వేడుకలను మనుషుల డివిజన్ పరిధి హిమపురికాలనీలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై పలువురు మాతృమూర్తులను ఘనంగా ఆయన సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, నాయకులు జగదీశ్ యాదవ్, నాగరాజు, రఘువీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న కాలనీవాసులు

## సీఎం సహాయనిధి చెక్కు అందజేత



మంచాల, మే 11: మండల పరిధిలోని లోయపల్లి గ్రామానికి చెందిన తుడుసునూటి లచ్చలు ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందింది. ముఖ్యమంత్రి సహాయ నిధికి బాధిత కుటుంబ సభ్యులు దరఖాస్తు చేసుకోగా వారికి మంజూరైన రూ. 60,000వేల చెక్కును ఆదివారం మాజీ ఎంపీపీ కొర్ర శ్రీనివాస్‌నాయక్ కుటుంబ సభ్యులకు అందజేశారు. వారి వెంట నాయకులు రామ్‌దాస్, నవీణ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## ఆలంఖాన్‌గూడలో డ్రైనేజీ కంపు



చేవెళ్ల రూరల్, మే 11 : శంకర్‌పల్లి మండల పరిధి ఆలంఖాన్‌గూడ గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నుంచి దుర్వాసన వెదజల్లుతోంది. కొందరు వ్యాపార సముదాయాలు, ఇండ్లలోంచి లెట్రిన్ పైపులను డ్రైనేజీ పైపుల్లో కలుపడంతో ఈ సమస్య ఉత్పన్నముతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇండ్లలోంచి బయటికి రాని పరిస్థితి నెలకొంటున్నదని, మొత్తం మల విసర్జన దుర్వాసన వస్తోందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి వెంటనే సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

**ఇంట్లో ఉండలేకపోతున్నాం..**

ఈ వాసనకు ఇంట్లో ఉండలేని పరిస్థితి నెలకొంటున్నది. డ్రైనేజీ లైన్‌లో లెట్రిన్ పైపులు కలుపడంతో మొత్తం జాం అయ్యి దుర్వాసన వెదజల్లుతోంది. పంచాయతీ కార్యదర్శికి విన్నవించినా పరిష్కారం అవ్వడం లేదు. చాలా ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

**- పులుమామిడి విమలమ్మ, ఆలంఖాన్‌గూడ గ్రామం**



## కూచిపూడి ప్రదర్శన


కొండాపూర్ : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామంలో ఆదివారం సాత్విక రెడ్డి , శ్రావ్య శిష్య బృందం భవ్య, నిత్య, పవన్ శ్రీజ , అనైక, సహస్ర, ఝువనా, గురు ప్రదర్శనలు, శ్రావ్య కూచిపూడి నృత్య రూపకం ఆకట్టుకున్నాయి.

## ఆర్థిక సాయం అందజేత



కడ్తాల్ (తలకొండపల్లి) మే 11: తలకొండపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2004-05 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు తమ తోటి స్నేహితురాలు అలివేలు ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న విషయాన్ని తెలుసుకుని తోటి మిత్రులు రూ. 17,300 అలివేలుకు అందజేశారు. వారి వెంట తోటి మిత్రులు గిరి, సత్యం, కుమార్, అన్వర్, కుమార్, జయకుమార్, జంగయ్య, సత్యం, చెన్నకేశవులు, రవి, జయకుమార్, వెంకటేశ్, పంతు, శంకర్, కుమార్ ఉన్నారు.

## వృద్ధుడి అదృశ్యం



పెద్దఅంబర్‌పేట, మే 11: వ్యక్తి అదృశ్యమైన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని మజీద్‌పూర్ గ్రామంలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. చంపాపేట్‌కు చెందిన 65 ఏండ్ల వయసున్న ఎండీ నజీర్.. సునీల్ అనే వ్యక్తి వద్ద పెయింటింగ్ పనిచేస్తున్నాడు. పని నిమిత్తం శనివారం మజీద్‌పూర్‌కు వచ్చాడు. మధ్యాహ్నం దుకాణానికి వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. సునీల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## ప్రజలకు ఉత్తమ సేవలందించాలి

మెహిదీపట్నం, మే 11 : ప్రజలకు ఉత్తమ సేవలందించడానికి పోలీసులు నిరంతరం కృషి చేయాలని టోలిచౌకి పోలీస్ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. టోలిచౌకి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. టోలిచౌకి, అజీజ్ బాగ్, అరవింద్ నగర్, సమతాకాలనీ, హకీంషా, పారా మౌంట్ ప్రాంతాల్లో పోలీసు లు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఏసీపీ సయ్యద్ ఫయాజ్‌తో పాటు, ఇన్‌స్పెక్టర్ రమేష్ నాయక్, అదనపు ఇన్‌స్పెక్టర్ బాలరాజ్, ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.